సాక్షి కామారెడ్డి

శనివారం । 16 । నవంబర్ । 2024

గరిష్ఠం/కనిష్ఠం
36.0 /17.0

వాతావరణం
ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.



మాగిలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద దీపారాధన చేస్తున్న భక్తులు

ఘనంగా కార్తీక దీపోత్సవం

జిల్లాలో శుక్రవారం కార్తీక పౌర్ణమిని ఘనంగా జరుపుకున్నారు. భక్తులు తెల్లవారుజామునే లేచి, పుణ్య స్నానాలు ఆచరించారు. దీపాలు వెలిగించి, తులసి పూజలు చేశారు. పండుగ సందర్భంగా ఆలయాలు కిటకిటలాడాయి.

న్యూస్‌రీల్

ఘనంగా బిర్సా ముండా జయంతి



కామారెడ్డి క్రైం: కలెక్టరేట్‌లో శుక్రవారం స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పూల మాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీసీడీవో రజిత, జిల్లా ప్రత్యేకాధికారి పద్మ, సీపీవో రాజారాం, జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీపతి, జిల్లా ట్రెజరీ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, టీఎన్జీవోస్ ప్రతినిధులు నారాయణ, వెంకటరెడ్డి, టీజీవో సెక్రెటరీ సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ అందిస్తాం'

కామారెడ్డి అర్బన్: దేవునిపల్లి విద్యుత్‌నగర్‌లో గల అక్షయ స్వయం ఉపాధి సంస్థ ద్వారా గ్రామాల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు సంస్థ ప్రతినిధి ఎస్.భూపాల్ తెలిపారు. టైలరింగ్, బ్యూటీషియన్, మగ్గం వర్క్, మెహిందీ డిజైనింగ్ కోర్సుల్లో శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. ఒక గ్రామానికి చెందిన ఇంటర్ పూర్తి చేసిన 29 ఏళ్లలోపు మహిళలు 30 మంది ముందుకువస్తే ఆ గ్రామానికే వెళ్లి శిక్షణ ఇస్తామని వివరించారు. ఇతర వివరాలకు 74167 13338 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

సెలవులో పాల్వంచ తహసీల్దార్

మాచారెడ్డి: పాల్వంచ తహసీల్దార్ జయంత్ రెడ్డి సెలవుపై వెళ్లారు. ఆయన స్థానంలో కామారెడ్డి ఆర్డీవో కార్యాలయ డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీనారాయణకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

నేడు, రేపు పత్తి కొనుగోళ్లు బంద్

కామారెడ్డి క్రైం: మద్నూర్‌లోని సీసీఐ కొనుగోలు కేంద్రంలో శని, ఆదివారాల్లో పత్తి కొనుగోళ్లు జరగవని జిల్లా మార్కెటింగ్ అధికారి రమ్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి శని, ఆదివారాలలో కొనుగోళ్లు ఉండవని పేర్కొన్నారు. పత్తి రైతులు దీనిని గమనించాలని సూచించారు.

సీఎం వద్దకు దోమకొండ ఆస్పత్రి ఫైల్

కామారెడ్డి టౌన్: దోమకొండలోని 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆస్పత్రిని 100 పడకలకు అప్‌గ్రేడ్ చేయడానికి సంబంధించిన ఫైల్ రెండు రోజుల క్రితం సీఎం రేవంత్ రెడ్డి వద్దకు చేరినట్లు తెలిసింది. సీఎం ఈ ఫైల్‌పై సంతకం చేయగానే ఆర్థిక శాఖ అధికారికంగా జీవో విడుదల చేయనుంది. ఇప్పటికే ఆస్పత్రి భవనం కోసం దోమకొండ గ్రామ పంచాయతీ ముత్యంపేట రోడ్‌లో నాలుగు ఎకరాల స్థలాన్ని కేటాయించిన విషయం తెలిసిందే. వంద పడకల ఆస్పత్రి ప్రారంభమైతే చుట్టుపక్కలనున్న మూడు జిల్లాల పరిధిలోని ప్రజలకు మేలు జరగనుంది.

రేపటి వరకు రేషన్ బియ్యం పంపిణీ

కామారెడ్డి రూరల్: రేషన్‌షాపుల ద్వారా అందజేస్తున్న నవంబర్ నెలకు సంబంధించిన ఉచిత బియ్యం పంపిణీ ఆదివారం వరకు కొనసాగుతుందని పౌరసరఫరాల శాఖ అధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మొదటగా ఈ నెల 15 వరకు చివరి తేదీ అని ప్రకటించినా ఇదే నెలలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని లారీల్లో రైస్ మిల్లులకు తరలించడం ద్వారా రేషన్ షాపులకు రేషన్ బియ్యం సరఫరా ఆలస్యమైంది. దీంతో రేషన్ పంపిణీ పూర్తిస్థాయిలో జరగకపోవడంతో పంపిణీ తేదీని పొడిగించినట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు రేషన్ బియ్యం తీసుకోని వినియోగదారులు ఏవరైనా ఉంటే సంబంధిత రేషన్ షాపుల్లో బియ్యం తీసుకోవాలని అధికారులు సూచించారు.

19న జిల్లా మున్నూరు కాపు సంఘం ఎన్నికలు

కామారెడ్డి అర్బన్: మున్నూరుకాపు సంఘం జిల్లా కమిటీ ఎన్నికలు ఈనెల 19న మంగళవారం స్థానిక వీక్లీ మార్కెట్‌లో ఉన్న సంఘ భవనంలో నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి పి అంజయ్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి ఆగ్రోస్ ఇండస్ట్రీస్ రాష్ట్ర చైర్మన్ కాసుల బాల్‌రాజు, జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు హాజరవుతారని పేర్కొన్నారు.

వివాదాల ఠాణా!

- పోలీస్ అధికారులపై అవినీతి ఆరోపణలు
- మూడు దశాబ్దాల్లో ఏసీబీకి పట్టుబడిన ముగ్గురు ఎస్సైలు
- కానిస్టేబుళ్లదీ అదే తీరు..



ఆ పోలీస్ స్టేషన్ ఎప్పుడూ ఏదో ఒక వివాదంలో చిక్కుకుంటోంది. అక్కడ పనిచేసిన అధికారులు, సిబ్బంది ఏదో ఒక వివాదంలో ఇరుక్కుపోవడం పరిపాటిగా మారింది. మూడు దశాబ్దాల కాలంలో ఆ ఠాణాలో పలువురు ఎస్సైలు, సిబ్బంది అవినీతి నిరోధక శాఖ వలకు చిక్కడం గమనార్హం. తాజాగా స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు లంచం తీసుకుంటూ ఎస్సై, రైటర్ ఏసీబీకి పట్టుబడడంతో మరోమారు ఈ స్టేషన్ చర్చనీయాంశమైంది.

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : లింగంపేట పోలీసు స్టేషన్ వివాదాల ఠాణా అన్న పేరు గడించింది. ఇక్కడ పనిచేసిన అధికారుల వైఖరి చాలాసార్లు వివాదాలకు కారణమైంది. లింగంపేట మండలంలోని ప్రజలు ఎంతో మర్యాదస్తులని, వారిని అనవసరంగా గెలికితే మాత్రం తిరుగుబాటు చేస్తారని గతంలో అక్కడ పనిచేసిన ఓ పోలీస్ అధికారి 'సాక్షి'తో పేర్కొన్నారు.

మరెన్నో వివాదాలు..

లింగంపేట పోలీసు స్టేషన్ మరెన్నో వివాదాలకు కేరాఫ్‌గా నిలిచింది. ఇక్కడ పనిచేసిన పలువురు ఎస్సైలు పలు వివాదాల్లో చిక్కుకున్నారు. స్థానికంగా ఉన్న ప్రజాప్రతినిధులు, ముఖ్యంగా లింగంపేట గ్రామ ప్రముఖులతో గొడవలు పడిన పలువురు ఎస్సైలకు పనిష్మెంట్ బదిలీలు కూడా జరిగాయి. సామాజిక అవగాహన, రాజకీయ చైతన్యం ఎక్కువగా ఉన్న లింగంపేట మండలంలో ఎప్పుడు ఎలాంటి వివాదం తలెత్తుతుందో తెలియని పరిస్థితి ఉంటుంది. అప్పట్లో కుష్టు వ్యాధిగ్రస్తుల కోసం షెల్టర్ ఏర్పాటు అంశం కూడా వివాదాస్పదమైంది. దానిపై ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగారు. అప్పుడూ పోలీసుల తీరు వివాదాస్పదమైంది. 2004లో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన దొంగనోట్ల కేసులో లింగంపేట మండలానికి చెందిన వ్యక్తి అరెస్టయ్యాడు. అంతర్జాతీయ నేరస్తుడు దావూద్ ఇబ్రహీంకు చెందిన డీ కంపెనీ ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసేందుకు పాకిస్తాన్ పన్నిన కుట్రమూలాలు ఈ కేసు ద్వారా బయటపడ్డాయి. 2016లో మెదక్ జిల్లా కేంద్రంలో ఏటీఎంలను చోరీ చేసిన దొంగలు మెదక్ నుంచి లింగంపేట మండలం మీదుగా వెళ్తుండగా పోలీసులు వారి వాహనంపై కాల్పులు జరిపిన సంఘటన సంచలనం కలిగించింది. పోలీసులనుంచి ఏటీఎం దొంగలు మాత్రం తప్పించుకువెళ్లారు. అలాగే రెండేళ్ల క్రితం వన్యప్రాణులను వధించి వాహనాల్లో తరలిస్తుండగా లింగంపేట పోలీసులు వెంబడించిన సంఘటన కూడా సంచలనం సృష్టించింది. ఈ కేసులో వన్యప్రాణులు వేటగాళ్లు పోలీసులకు చిక్కారు. నకిలీ పాసుపుస్తకాలతో బ్యాంకుల్లో అడ్డగోలుగా అప్పులు తీసుకున్న వ్యవహారంపైనా ఎన్నో వివాదాలున్నాయి. అక్రమ దందాలు, వన్యప్రాణుల వేట, రెండు మూతుల పాములు, నక్షత్ర తాబేళ్ల రవాణా తదితర సంఘటనలూ ఈ ప్రాంతంలో చోటు చేసుకున్నాయి.

మూడు దశాబ్దాల నాడే ఏసీబీ కేసు...

లింగంపేట పోలీస్ స్టేషన్ 1976లో ఏర్పాటయ్యింది. అప్పటినుంచి వివాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. 1996లో ఎస్సై శ్రీనివాసులు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన సంఘటన అప్పట్లో సంచలనం కలిగించింది. తర్వాత 2003 లో ఎస్సై నాగేందర్, స్టేషన్ రైటర్ సురేశ్‌లు ఏసీబీకి చిక్కారు. ఆ తర్వాతా పలువురు పోలీసులపై ఆరోపణలు వచ్చాయి. 2016 లో పనిచేసిన ఓ ఎస్సైని ఏసీబీ అధికారులు పట్టుకునే ప్రయత్నం చేశారు. అయితే ఆయన తృటిలో తప్పించుకున్నారు. తాజాగా అదే ఠాణాలో ఎస్సై అరుణ్‌కుమార్, రైటర్ రామస్వామిలు స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు లంచం తీసుకుంటూ రెండు రోజుల క్రితం ఏసీబీకి చిక్కారు. ఈ ఘటన మరోసారి లింగంపేట ఠాణాను చర్చనీయాంశం చేసింది.

మాజీ ఎమ్మెల్యే అరెస్ట్‌తో..

1994లో ఎన్నికల సమయంలో తహసీల్దార్‌పై జరిగిన దాడి ఘటనలో ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే కిషన్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. దీంతో ఆగ్రహానికి గురైన లింగంపేట మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు పోలీసు స్టేషన్‌పై దాడి చేశారు. ఈ సంఘటన అప్పట్లో సంచలనం సృష్టించింది. మండలంలో పలు వివాదాలకు పోలీసు అధికారుల వైఖరి కారణమైంది. ఆయా ఘటనలతో లింగంపేట పోలీస్ స్టేషన్ అంటేనే అదొక వివాదాల ఠాణా అన్న పేరు వచ్చింది.

నయనానందకరం.. రథోత్సవం

- లింబాద్రి గుట్ట జాతరకు వేలాదిగా తరలివచ్చిన జనం



ఉత్సవ మూర్తుల ఊరేగింపు

మోర్తాడ్: ప్రతియేట కార్తీక మాసంలో లింబాద్రి గుట్టపై నిర్వహించే శ్రీ లక్ష్మీ నరసింహుని రథోత్సవం శుక్రవారం కనుల పండువగా సాగింది. వేలాది మంది భక్తుల జయ జయ ధ్వానాల మధ్య ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు నంబి పార్థసారథి, నంబి విజయసారథి, వాసుదేవాచార్యులు, ఇతర వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య స్వామివారి రథ ప్రతిష్ఠ నిర్వహించారు. శ్రీమన్నారాయుడిని ఆహ్వానించి షోడపోచార పూజలు చేశారు. బలిపూజల అనంతరం రథోత్సవం ఘనంగా సాగింది. పుష్పాలంకరణ చేసిన రథంపై స్వామి వారిని ఊరేగించారు. తెల్లవారు జామున గర్భాలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. గర్భాలయంలోని స్వామి వారి ఆయుధమైన శ్రీ చక్రాన్ని పల్లకిలో తెచ్చారు. హోమం, నైవేద్యం సమర్పణ, బలిహరణం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గోవింద నామ స్మరణ మార్మోగుతుండగా మంగళ హారతులు, మేళతాలాలు, చప్పుల్ల మధ్య రథోత్సవ సాగింది. శ్రీ లక్ష్మీ నరసింహుని దర్శించుకునేందుకు ఉదయం నుంచే భక్తులు బారులు తీరారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తజనం

సన్నరకం ధాన్యం సేకరణపై ఫోకస్

కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన టాస్క్‌ఫోర్స్ ఓఎస్డీ



నర్వలో రైతులతో మాట్లాడుతున్న టాస్క్‌ఫోర్స్ ఓఎస్డీ శ్రీధర్‌రెడ్డి

నిజాంసాగర్: ప్రభుత్వం సన్నరకం వరిధాన్యానికి క్వింటాలుకు రూ. 500 చొప్పున బోనస్ చెల్లిస్తామని ప్రకటించిన నేపథ్యంలో ధాన్యం తూకాలపై ప్రత్యేక దృష్టి సారించింది. కొనుగోలు కేంద్రాలతోపాటు మిల్లులను టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీ చేస్తున్నారు. శుక్రవారం టాస్క్ ఫోర్స్ ఓఎస్డీ శ్రీధర్‌రెడ్డి మహమ్మద్‌నగర్ మండలంలోని నర్వ, మహమ్మద్‌నగర్ గ్రామాల్లో పర్యటించి కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. తూకాలను పరిశీలించి, రైతులతో మాట్లాడారు.

జోరుగా కొనుగోళ్లు..

జిల్లాలో 423 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన సర్కారు.. ఇప్పటివరకు 383 కేంద్రాలలో తూకాలను ప్రారంభించింది. ఆయా కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 1.5 లక్షల మెట్రిక్ టన్నుల వరిధాన్యాన్ని సేకరించారు. 4,562 మంది రైతుల నుంచి రూ.70.31 కోట్ల విలువైన దొడ్డు రకం ధాన్యం, 2,456 మంది రైతుల నుంచి రూ. 20.19 కోట్ల విలువైన సన్న రకం వరిధాన్యాన్ని కొనుగోలు చేశారు. కొనుగోళ్ల సక్రమంగా సాగుతున్నాయో లేదో తెలుసుకోవడానికి టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. సన్న రకం వరి పండించిన రైతుల వద్దకు వెళ్లి వివరాలు తెలుసుకుంటున్నారు. దొడ్డు రకాలను సన్నరకంగా చెప్పి విక్రయిస్తున్నారా, ప్రైవేట్ వ్యాపారులు కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేంద్రాల్లో సేకరిస్తున్నారా అంటూ ఆరా తీస్తున్నారు. సన్న రకానికి ప్రైవేట్‌లో లభిస్తున్న మద్దతు ధర ఎంత, ఏ రకానికి ఎంత ధర దక్కుతోంది అన్న వివరాలు తెలుసుకుంటున్నారు. కాగా మార్కెట్‌లో సన్నరకం వడ్లకు క్వింటాలుకు 2,300 చొప్పున చెల్లిస్తున్నారు. దీంతో చాలామంది రైతులు కొనుగోలు కేంద్రాలలో విక్రయించడానికే ఆసక్తి చూపుతున్నారు.

జిల్లాకు పారా మెడికల్ కోర్సులు

- జిల్లా వైద్య కళాశాలలో డీఎంఎల్‌టీ, డీఈసీజీ కోర్సులు..
- 20 వరకు దరఖాస్తులకు గడువు



కామారెడ్డి మెడికల్ కళాశాల

కామారెడ్డి టౌన్ : అనేక వ్యాధులకు చికిత్స అందించడంలో వైద్యుల పాత్ర ఎంత కీలకమో వారికి తెర వెనుక సహకారం అందించడంలో పారా మెడికల్ సిబ్బంది పాత్ర కూడా అంతే కీలకం. అంత ప్రాముఖ్యత కలిగిన పారామెడికల్ కోర్సులను అభ్యసించడానికి జిల్లా విద్యార్థులకు అవకాశాలు అందివచ్చాయి. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో రెండు కోర్సులలో ప్రవేశాలకు పారా మెడికల్ బోర్డు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈ ఏడాది నుంచే డీఎంఎల్‌టీ, డీఈసీజీ కోర్సులు ప్రారంభం కానున్నాయి.

మెరుగవనున్న వైద్య సేవలు

పారామెడికల్ కోర్సులు ప్రారంభమైతే జిల్లా జనరల్ ఆస్పత్రిలో సేవలు మరింత మెరుగయ్యే అవకాశాలున్నాయి. ఇప్పటికే ఎంబీబీఎస్ రెండో సంవత్సరం విద్యార్థులు జిల్లా జనరల్ ఆస్పత్రికి వెళ్లాల్సి ఉంటుంది. అలాగే పారామెడికల్ కోర్సులలో చేరే వారు సైతం జిల్లా ఆస్పత్రిలో ప్రాక్టికల్స్‌కు వెళ్లడంతో పాటు మధ్యాహ్న సమయంలో వైద్య కళాశాలలో తరగతులకు హాజరుకావాల్సి ఉంటుంది.

రెండు కోర్సుల్లో కలిపి 60 సీట్లు..

వైద్య సేవలు అందించేందుకు వైద్యులతో పాటు పారామెడికల్ సిబ్బందికి కూడా ప్రభుత్వం అవసరమైన వైద్య కోర్సులను అందుబాటులోకి తీసుకువచ్చింది. పారామెడికల్‌లో మొత్తం 21 కోర్సులు ఉండగా కామారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలలో డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ (డీఎంఎల్‌టీ), డిప్లొమా ఇన్ ఈసీజీ టెక్నీషియన్ (డీఈసీజీ) కోర్సులను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఒక్కో కోర్సులో 30 సీట్ల చొప్పున కేటాయించారు. ఈ కోర్సుల కాలవ్యవధి రెండేళ్లు. ఇంటర్ బైపీసీ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ కోర్సులకు అర్హులు. అయితే బైపీసీ విద్యార్థులు లేకపోతే ఇంటర్‌లో ఇతర కోర్సులు చేసిన వారికి సైతం అవకాశం కల్పించనున్నారు. ఈనెల 20 వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంది. ఆసక్తి గలవారు దరఖాస్తు ఫారం, ఇతర వివరాలకోసం www.tgpmb.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలి.

ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి




కామారెడ్డి వైద్య కళాశాలలో డీఎంఎల్‌టీ, డీఈసీజీ కోర్సులను ప్రారంభించాం. ఈ కోర్సులు చేసినవారికి మంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాలుంటాయి. ఇంటర్ పూర్తి చేసిన అర్హులైన విద్యార్థులు ఈనెల 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి.

– శివప్రసాద్, ప్రిన్సిపల్, మెడికల్ కళాశాల, కామారెడ్డి

యాడున్నరో.. ఎట్లున్నరో?

- గల్ఫ్ దేశాలలో సుమారు వందమంది జిల్లావాసుల గల్లంతు
- వారి రాక కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్న కుటుంబ సభ్యులు
- సర్కారు ఆదుకోవాలని కోరుతున్న బాధితులు



రామారెడ్డి : ఉన్న ఊళ్లో ఉపాధి అవకాశాలు లేక చాలామంది అప్పులు చేసి మరీ ఎడారి దేశాలకు వలస వెళ్తున్నారు. అలా వెళ్తున్నవారిలో కొందరి ఆచూకీ గల్లంతవుతోంది. వారు ఎక్కడున్నారో.. ఎలా ఉన్నారో తెలియక వారి కుటుంబ సభ్యులు నరకం అనుభవిస్తున్నారు. కాగా జిల్లానుంచి విదేశాలకు వలస వెళ్లినవారిలో సుమారు వంద మంది ఆచూకీ తెలియడం లేదని గల్ఫ్ సంక్షేమ సంఘం ప్రతినిధులు పేర్కొంటున్నారు. ఉపాధి కోసం అప్పులు చేసి విదేశాలకు వెళ్లిన కుటుంబ సభ్యులు ఎక్కుడున్నారో తెలియక వారి కుటుంబ సభ్యులు ఇబ్బందిపడుతున్నారు. ఓవైపు అప్పుల భారం పెరిగిపోతుండగా.. మరోవైపు తమవారి పరిస్థితి ఏమిటన్నది తెలియక ఆందోళన చెందుతున్నారు.

మరణించిన వారికే పరిహారం!

రాష్ట్ర ప్రభుత్వం గల్ఫ్ బాధితులను ఆదుకునేందుకు ముందుకొచ్చింది. 2023 డిసెంబర్ 7 తర్వాత గల్ఫ్ దేశాలలో చనిపోయినవారి కుటుంబాలకు ఇటీవల ఒక్కో కుటుంబానికి రూ. 5 లక్షల చొప్పున పరిహారం అందిస్తోంది. అయితే ఇది గల్ఫ్‌లో మరణించిన వారికే వర్తిస్తుంది. కనిపించకుండా పోయినవారికి సంబంధించి ఎలాంటి పథకం లేదు. వారి కుటుంబాలు దీన స్థితిలో ఉన్నాయి. తమను ఆదుకోవాలని బాధిత కుటుంబాలు కోరుతున్నాయి. గల్ఫ్‌లో తప్పిపోయినవారి కుటుంబాలకు సైతం ఆర్థిక సాయం అందించాలని గల్ఫ్ సంక్షేమ సంఘం ప్రతినిధులు కోరుతున్నారు.



ఈయన పేరు ఎగ్గిని బక్క మల్లయ్య. ఇసన్నపల్లికి చెందిన ఈయన 2008లో రూ.లక్ష అప్పు చేసి మస్కట్ వెళ్లడానికి బయలుదేరాడు. ముంబయిలో విమానం ఎక్కేముందు చివరిసారిగా భార్య మల్లవ్వతో ఫోన్ ద్వారా మాట్లాడాడు. ఆ తర్వాత ఆయన ఎటు వెళ్లాడో.. ఏమయ్యాడో.. తెలియదు. ఆచూకీ తెలియక కుటుంబ సభ్యులు ఇప్పటికీ ఆందోళన చెందుతున్నారు. మస్కట్‌లో ఉన్న రామారెడ్డి, ఇసన్నపల్లివాసుల ద్వారా బక్క మల్లయ్య ఆచూకీ కనుక్కునేందుకు ఆయన భార్య ఇప్పటికీ ప్రయత్నిస్తూనే ఉన్నా ఫలితం లేదు. రెడ్డిపేట గ్రామానికి చెందిన లింగం అనే వ్యక్తి 25 ఏళ్ల క్రితం దుబాయికి వెళ్లాడు. ఆయన ఆచూకీ సైతం ఇప్పటికీ తెలియలేదు.

ముంబయి నుంచి చివరి ఫోన్



నా భర్త ఎగ్గిని బక్క మల్లయ్య 2008లో మస్కట్ వెళ్లిండు. వెళ్లేప్పుడు ముంబయి నుంచి ఫోన్ చేసిండు. విమానం ఎక్కుతున్ననని చెప్పిండు. అదే ఆఖరి సారి మాట. అప్పటినుంచి ఆయన ఆచూకీ లేదు. సర్కారు పట్టించుకుని నా భర్త ఆచూకీ కనుక్కోవాలి. మా కుటుంబాన్ని ఆదుకోవాలి.

– ఎగ్గిని మల్లవ్వ, ఇసన్నపల్లి

ప్రభుత్వం ఆదుకోవాలి



ఉపాధి కోసం వలస వెళ్లి కనిపించకుండా పోయినవారు జిల్లాలో వంద మంది వరకు ఉన్నారు. వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి. గల్ఫ్ దేశాల్లో మృతి చెందినవారి కుటుంబాలకు ఇచ్చినట్లే ఆర్థిక సాయం అందించాలి.

– సురేందర్‌రెడ్డి, గల్ఫ్ సంక్షేమ సంఘం ప్రతినిధి

నేటినుంచి రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ

నిజామాబాద్ నాగారం: నిజామాబాద్ ఆఫీసర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నగరంలోని క్లబ్ ప్రాంగణంలో రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ టోర్నమెంట్ శని, ఆదివారాల్లో నిర్వహిస్తున్నట్లు క్లబ్ కార్యదర్శి చిలివేరి సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం క్లబ్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఈ టోర్నీకి రాష్ట్రంలోని అన్ని జిల్లాల క్రీడాకారులు హాజరవుతారని పేర్కొన్నారు. క్రీడాకారుల్లో ప్రతిభను వెలికి తీయడానికి టోర్నీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్లబ్ సంయుక్త కార్యదర్శి వెంకట్ రాములు, గంగకిషన్, బి.డి దాస్, కిరణ్ కుమార్ గౌడ్, అంగిరేకుల సాయిలు, డాకం సాయిలు, డాక్టర్ రాములు, అరవింద్, రచ్చ మురళి పాల్గొన్నారు.

ఇందూరు తిరుమల క్షేత్రంలో ఔషధ సేవలు

మోపాల్: మోపాల్ మండలంలోని నర్సింగ్‌పల్లిలో గల ఇందూరు తిరుమలలో పౌర్ణమి సందర్భంగా గర్భిణులకు ఉచిత ఔషధ సేవ కార్యక్రమాన్ని శుక్రవారం రాత్రి నిర్వహించారు. అదే విధంగా ఏడాదిలో కేవలం కార్తిక పౌర్ణమి రోజు మాత్రమే ఇచ్చే ఆస్తమా నివారిణి, ఆస్తమా నిరోధిని అయిన దివ్య ఔషధాన్ని సాయంకాలం భక్తులకు ఉచితంగా ఇచ్చారు. అస్తమా రుగ్మత ఉన్నవారికి, అస్తమా భవిష్యత్తులో రాకుండా ఉండడానికి ముందు జాగ్రత్తగా ఈ ఔషధాన్ని ప్రసాదంగా ఆలయంలో అందించామని ఆలయ ధర్మకర్త నర్సింహారెడ్డి తెలిపారు.

క్లుప్తంగా

మాల సంఘం జిల్లా అధ్యక్షుడిగా రతన్‌కుమార్



కామారెడ్డి అర్బన్: మాల సంఘం జిల్లా కమిటీని శుక్రవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో సంఘం రాష్ట్ర నాయకుడు అయ్యాల సంతోష్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా సంకి రతన్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా నీరెడ్డి మైసయ్య, కోశాధికారిగా మైండ్ల ప్రభాకర్, ఉపాధ్యక్షులుగా పి పెద్ద సాయిలు, వాగ్మరే లక్ష్మణ్, పసుల నరేశ్ ఎన్నికయ్యారు. అనంతరం జిల్లా కార్యవర్గానికి సంతోష్ నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీనివాస్, పాపయ్య, సాయిలు, రాజు, నరేశ్, మైసయ్య, కాశీరాం తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్‌కు అభినందనలు



బాన్సువాడ రూరల్: టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత గుప్తాను శుక్రవారం బీర్కూర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు అబ్దుల్ అహ్మద్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంలోనూ సుజాత కృషి ఉందన్నారు.

సిద్ధేశ్వర ఆలయ అభివృద్ధికి కృషి చేస్తాం



తాడ్వాయి: సిద్ధేశ్వరాలయాన్ని మరింత అభివృద్ధి చెందేలా తమవంతు కృషి చేస్తామని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్, శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి అన్నారు. తాడ్వాయి మండలంలోని బ్రాహ్మజివాడిలో ఉన్న సిద్ధేశ్వరాలయంలో ఆలయ ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలు పైడి ఎల్లారెడ్డి ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. ఆలయంలో వారు ఉదయం ప్రత్యేక పూజలు, హోమం చేశారు. ఆలయానికి రోడ్లు, తాగు నీటిసమస్య, పలు సమస్యలు పరిష్కారమయ్యేలా కృషి చేస్తామన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. అంతకు ముందు ఎమ్మెల్యే మదన్ మోహన్ తాడ్వాయిలో ఉన్న శబరిమాతాశ్రమాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని సాధించారు

ప్రభుత్వం ఉద్యోగం సాధించాలనేది వారి లక్ష్యం.. దాని కోసం ఎంతటి కష్టనష్టాలనైనా ఎదుర్కొనేందుకు సిద్ధమయ్యారు. చివరికి వారి కుటుంబాల్లో ఎన్ని అవరోధాలు ఎదురైనా ఎదుర్కొని తమ కలను సాకారం చేసుకునేందుకు విశేషంగా కృషి చేశారు. అనుకున్న లక్ష్యాన్ని సాధించి అందరిని ఔరా అనిపించారు. గ్రూప్–4 ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. కామారెడ్డి జిల్లాలో ఎంతో మంది అభ్యర్థులు గ్రూప్–4 పరీక్షలు రాశారు. కొందరు చిన్నవయస్సులోనే కొలువు సాధించగా.. మరికొందరికి ఏళ్ల నిరీక్షణ తర్వాత సఫలమయ్యారు. తమ కృషికి ఫలితం దక్కడంతో వారు హర్షం వ్యక్తం చేశారు. వారి నేపథ్యం, విజయగాథలు ఇలా ఉన్నాయి.

బాల్యం నుంచే ఎన్నో ఒడిదొడుకులు..



దుమాల శ్వేత

సదాశివనగర్: బాల్యం నుంచే ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటు అనుకున్న లక్ష్యాన్ని సాధించింది సదాశివనగర్‌కు చెందిన దుమాల శ్వేత. ఆమె తండ్రి బాల్యంలోనే మృతి చెందాడు. నాటి నుంచి తల్లి రాజమణి చిరు ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. రాజమణికి ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు. పెద్ద కూతురు స్వాతి బీఎస్సీ నర్సింగ్ చేయించింది. చిన్న కూతురు శ్వేత గ్రూప్స్‌కు ప్రిపేర్ అయ్యి ప్రభుత్వం ఉద్యోగం పొందింది. నా విజయానికి అమ్మతో పాటు, పెద్దమ్మ, పెద్దమ్మ కుమారుల కృషి ఎంతో ఉంది.

పట్టుదలతో చదివి..



మహేష్



అఖిల్ గౌడ్

మాచారెడ్డి: పాల్వంచ మండలం మంతన్ దేవునిపల్లి గ్రామానికి చెందిన రాసమల్లు మహేశ్, భవానిపేటకు చెందిన ఆశన్నగారి అఖిల్ గౌడ్ పట్టుదలతో చదివి అనుకున్న లక్ష్యాన్ని సాధించారు. గ్రూప్–4 ఫలితాల్లో మహేశ్ ఎక్సైజ్ ప్రొహిబిషన్ శాఖలో, అఖిల్ గౌడ్ విద్యాశాఖలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించారు. దేవునిపల్లి నుంచి ప్రభుత్వ ఉద్యోగం సాధించిన ఒకే ఒక వ్యక్తి మహేష్ అంటూ గ్రామస్తులు ప్రశంసించారు.

అక్కా చెల్లెళ్లకు రెండుసార్లు..



హన్మాల వైష్ణవి



హన్మాల రమ్య

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మండలం చిన్న మల్లారెడ్డి గ్రామానికి చెందిన హన్మాల రమ్య, హన్మాల వైష్ణవి చిన్ననాన్న పెద్దనాన్న కూతుళ్లు. వీరు ఇటీవల రాసిన డీఎస్సీ ఫలితాల్లో ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. గురువారం ప్రకటించిన గ్రూప్–4 ఫలితాల్లో కూడా వీరు విద్యాశాఖలో ఉద్యోగాలు సాధించారు. వీరి కృషి, పట్టుదలే వారిని ఈ స్థాయికి తెచ్చిందంటు గ్రామస్తులు తెలిపారు.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే..



యువకులను సన్మానిస్తున్న యూత్ సభ్యులు

నాగిరెడ్డిపేట: తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే తాము గ్రూప్–4 ఉద్యోగాలు సాధించామని మండల కేంద్రంలోని గోపాల్‌పేటకు చెందిన చాకలి రవకుమార్, చాకలి అరవింద్ అన్నారు. వీరిని గ్రామంలోని శ్రీసాయినాథ్ యూత్ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సభ్యులు వంశీగౌడ్, మహేశ్, కిరణ్, ప్రశాంత్, అరవింద్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు చేస్తూనే..



రావర్తి దుర్గాప్రసాద్



గొబ్బూరి నరేందర్‌రెడ్డి

బీబీపేట: మండలంలోని యాడారం గ్రామానికి చెందిన రావర్తి దుర్గాప్రసాద్, గొబ్బూరి సందీప్‌రెడ్డి ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తూనే గ్రూప్–4 ఫలితాల్లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. దుర్గాప్రసాద్ డిచ్‌పల్లి 7వ బెటాలియన్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. అంతే కాకుండా గతంలో సివిల్ కానిస్టేబుల్, డీఎస్సీలో ఉద్యోగం సాధించాడు. ప్రస్తుతం గ్రూప్–4 రెవెన్యూ విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించాడు. సందీప్‌రెడ్డి ఎక్సైజ్ శాఖలో విధులు నిర్వహిస్తూనే గ్రూప్–4 ట్రెజరీ శాఖలో ఉద్యోగం సాధించాడు. ఇద్దరు ఉద్యోగాలు సాధించడంతో గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

సోదరుడి బాటలో..



అల్లంగల్ల వినయ్

బీబీపేట: మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన అల్లంగల్ల వినయ్ గ్రూప్–4 ఫలితాల్లో మున్సిపల్ శాఖలో జూనియర్ అకౌంటెంట్ ఎంపికయ్యాడు. అతని సోదరుడు రాంచంద్రం కెనరా బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నాడు. సోదరుడిని ఆదర్శంగా తీసుకొని ఉద్యోగానికి సిద్ధమవడతో అనుకున్న లక్ష్యాన్ని సాధించాడు. అన్నదమ్ములు ఇద్దరు ఉద్యోగాలు చేస్తుండడంతో గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

తాపీ మేస్త్రీ కొడుకు..



దాసరి యాదగిరి

లింగంపేట: మండలంలోని లింగంపేటకు చెందిన దాసరి గోపి తాపీమేస్త్రీ. అతని కుమారుడు దాసరి యాదగిరి గ్రూప్–4 ఫలితాల్లో సత్తాచాటి ఉద్యోగం సాధించాడు. పబ్లిక్ హెల్త్ ఫ్యామిలీ వెల్ఫేర్ డిపార్టుమెంట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం పొందాడు. నా విజయానికి తల్లిదండ్రులు, స్నేహితులు ఎంతో ప్రోత్సహించారు.

కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే



బాన్సువాడలో సర్వేను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి



క్యాసంపల్లిలో.. ఆర్డీవో రంగనాథ్‌రావు



తాడ్వాయిలో.. ఎంపీడీవో సాజిద్‌అలీ



పెద్దకొడప్‌గల్‌లో.. ఎంపీడీవో లక్ష్మీకాంత్‌రెడ్డి

బాన్సువాడ/కామారెడ్డి రూరల్/తాడ్వాయి/పెద్దకొడప్‌గల్/లింగంపేట/నాగిరెడ్డిపేట: జిల్లాలోని అన్ని గ్రామాల్లో ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి కుటుంబ సమగ్ర సర్వే కొనసాగుతోంది. బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని తాడ్కోల్ డబుల్ బెడ్‌రూం కాలనీలో కొనసాగుతున్న సర్వేను బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి శుక్రవారం పరిశీలించారు. ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు. ఆమె వెంట సిబ్బంది మల్లికార్జున్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తుల శ్రీనివాస్, వనజ తదితరులు ఉన్నారు. కామారెడ్డి మండలంలోని క్యాసంపల్లి, చిన్నమల్లారెడ్డి, పలు గ్రామాల్లో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వేను ఆర్డీవో రంగనాథ్‌రావు పరిశీలించారు. అర్హులకు సంక్షేమ పథకాలను అమలు చేసేందుకే ప్రభుత్వం సర్వే చేపడుతుందని పేర్కొన్నారు. ఆయన వెంట ఎంపీడీవో నాగవర్ధన్, ఎంపీవో హెప్సీబారాణి, ఫీల్డ్ అసిస్టెంట్ శ్యామ్, ఎన్యుమరేటర్లు తదితరులు ఉన్నారు. తాడ్వాయి మండల కేంద్రంతో పాటు చందాపూర్, సంగోజివాడి గ్రామాల్లో చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వేను ఎంపీడీవో సయ్యద్ సాజిద్‌అలీ పరిశీలించారు. ఎన్యుమరేటర్లు ఇంటింటికి తిరుగుతూ కుటుంబ సభ్యుల వివరాలను సేకరిస్తున్నారు. పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంలో నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేను ఎంపీడీవో లక్ష్మీకాంత్‌రెడ్డి పరిశీలించారు. సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. లింగంపేట మండలంలోని మెంగారం, లింగంపేట, బాయంపల్లి, కొర్పోల్, పలు గ్రామాల్లో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వేను మండల అభివృద్ధి అధికారి నరేశ్ పరిశీలించారు. ఆయన వెంట సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లు ఉన్నారు. నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం, మాల్తుమ్మెద గ్రామాల్లో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వేను ఎంపీడీవో ప్రభాకరచారి పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు తిరుపతి, అశోక్ తదితరులు ఉన్నారు.



మెంగారంలో.. ఎంపీడీవో నరేశ్



పోచారంలో.. ఎంపీడీవో ప్రభాకరచారి

భక్తి శ్రద్ధలతో గురునానక్ జయంతి



శోభాయాత్రలో పాల్గొన్న సిక్కులు



శోభాయాత్రలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

నిజామాబాద్ రూరల్: నగరంలోని గాజుల్‌పేట్‌లో గల గురుద్వారాలో గురునానక్ జయంతిని శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి గురుద్వారాలో సంకీర్తన, గురు గ్రంథ పఠనం కొనసాగింది. అనంతరం సిక్కులు ప్రత్యేక పూజలు చేశారు. ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, నుడా చైర్మన్ కేశ వేణు, సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు నరేందర్‌సింగ్ గురుద్వార్‌లో పూజలు చేశారు. సిక్కులు నుడా చైర్మన్‌ను ఘనంగా సన్మానించారు. సాయంత్రం గురుద్వారా నుంచి పెద్ద బజార్, నెహ్రూ పార్క్ అహ్మదీబజార్ మీదుగా శోభాయాత్ర నిర్వహించారు. యువకుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. శోభాయాత్రలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

కామారెడ్డి క్రైం: మద్యానికి బానిసైన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డిలోని శ్రీరామ్‌నగర్ కాలనీలో శుక్రవారం జరిగింది. వివరాలు.. కాలనీకి చెందిన ఉల్లి నరేష్ (35) ఎల్లారెడ్డిలోని ఓ హోటల్లో వంట మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిస అయ్యాడు. తరచుగా భార్య పిల్లలను వేధిస్తూ ఉండేవాడు. శుక్రవారం ఉదయం కూడా మద్యం తాగి ఇంటికి వచ్చాడు. మధ్యాహ్నం ఇంట్లోని వంటగదిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మద్యం మత్తులో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుడి భార్య లావణ్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

ఇద్దరు కుమారులతో తల్లి అదృశ్యం

కామారెడ్డి క్రైం: కామారెడ్డి పట్టణంలోని ఎన్జీవోస్ కాలనీకి చెందిన ఓ తల్లి తన ఇద్దరు కుమారులతో సహా అదృశ్యమైనట్లు ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి శుక్రవారం తెలిపారు. కాలనీలో నివాసం ఉండే జొన్నల కల్యాణి తన ఇద్దరు కుమారులు విపుల్, సృజన్‌తో కలిసి గురువారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లింది. చాలా చోట్ల గాలించిన ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె భర్త రవి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా కొద్దిరోజులుగా కల్యాణి కుటుంబంలో భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నట్లు తెలిసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు. వారి ఆచూకీ తెలిసిన వారు పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

వేర్వేరు ప్రమాదాల్లో పలువురి మృతి

ఉమ్మడి జిల్లాలో వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు మృతి చెందారు. వ్యవసాయ బావిలో పడి రైతు, రైలులో నుంచి కింద పడి గుర్తు తెలియని మహిళ చనిపోయారు. మద్యం మత్తులో కింద పడి ఓ వ్యక్తి, వాగులో మునిగి మరొకరు మృత్యువాత పడ్డారు.



రవీందర్(ఫైల్)

రాజంపేట: బావిలో పడి ఒకరు మృతి చెందిన ఘటన రాజంపేట మండలం పెద్దాయిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన కామిశెట్టి రవీందర్ వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం తన భార్య రాణి, గ్రామస్తుడు మైలారం చింటూలతో కలిసి బీర్నిస్ పంటకు పురుగుల మందు కొట్టడానికి ఉదయం 9 గంటలకు పంట పొలానికి వెళ్లాడు. కరెంట్ లేక పోవడంతో రవీందర్ పక్కనే ఉన్న రైతు బస్వన్న వ్యవసాయ బావి నుంచి నీరు తీసుకు రావడానికి వెళ్లాడు. అయితే బావి వద్దకు వెళ్లిన ఆయన తిరిగి రాలేదు. దీంతో రాణి భయపడి గ్రామస్తులకు సమాచారం ఇచ్చింది. వారు బావిలో గాలించగా రాత్రి పది గంటల ప్రాంతంతో మృతదేహం లభించింది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై పుష్పరాజ్ తెలిపారు.

రైలులో నుంచి పడి మహిళ..

కామారెడ్డి క్రైం/ఖలీల్‌వాడి: ప్రమాదవశాత్తు రైలులో నుంచి పడి గుర్తు తెలియని మృతి చెందింది. ఈ ఘటన సిర్నాపల్లి–ఉప్పల్వాయి రైల్వేస్టేషన్‌ల మధ్య చోటు చేసుకున్నట్లు రైల్వే ఎస్సై తావునాయక్ శుక్రవారం తెలిపారు. నిజామాబాద్ స్టేషన్ మేనేజర్ నవీన్ ఇచ్చిన సమాచారం మేరకు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించామని పేర్కొన్నారు. ఆమె వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, వయసు 25 నుంచి 30 ఏళ్ల మధ్య ఉంటుందని తెలిపారు. మృతురాలి వివరాలు తెలిస్తే రైల్వే పోలీసుల(8712658591)ను సంప్రదించాలని కోరారు.

మద్యం మత్తులో కిందపడి..

మద్నూర్(జుక్కల్): మద్నూర్‌లోని లచమమ్మ ఆలయం వద్ద బోయరాజు(45) మద్యం మత్తులో కింద పడి మృతి చెందినట్లు శుక్రవారం ఎస్సై విజయ్ కొండ తెలిపారు. వివరాలు.. నారాయణఖేడ్‌కు చెందిన బోయరాజు బతుకుదెరువు కోసం గత కొన్నేళ్ల క్రితం మద్నూర్ వచ్చాడు. గురువారం స్థానిక శివాజీ చౌక్‌లోని లచమమ్మ ఆలయం వద్ద బోయరాజు మద్యం మత్తులో కిందపడి మృతి చెందాడు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై పేర్కొన్నారు. కాగా బోయరాజు కుటుంబం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉండడంతో పాటు స్థానికంగా వారికి తెలిసిన వారు లేకపోవడంతో పోలీసులే అంత్యక్రియలు చేశారు. మద్నూర్ ఎస్సై విజయ్ కొండ, పోలీసు సిబ్బంది సహాయం చేశారు. గ్రామ పంచాయతీ సహకారంతో మద్నూర్‌లో బోయరాజు అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నారు. పోలీసులను గ్రామస్తులు అభినందించారు.

వాగులో మునిగి ఒకరు..



సురేశ్ (ఫైల్)

మద్నూర్(జుక్కల్): డోంగ్లీ మండలంలోని పెద్ద టాక్లీ గ్రామానికి చెందిన గాయక్‌వాడ్ సురేశ్(36) గ్రామ శివారులోని వాగులో పడి మృతి చెందినట్లు ఎస్సై విజయ్ కొండ తెలిపారు. వివరాలు.. సురేశ్ అత్తగారి ఊరు వాగుకు అటు పక్కనే ఉన్న మహారాష్ట్రలోని సాంగ్వి గ్రామం. గురువారం అత్తగారింటికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. వాగు దాటే క్రమంలో ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి భార్య లక్ష్మీబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు..



గంగాధర్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి శివారులో యానం గుట్ట సమీపంలో శుక్రవారం సాయంత్రం ట్రాక్టర్ ఢీకొని సోలం గంగాధర్(35) మృతిచెందాడు. వివరాలు.. సోలం గంగాధర్ కొన్ని నెలలుగా బతుకు దెరువు కోసం జాక్రన్‌పల్లి మండలం కేశ్‌పల్లి గ్రామంలో ఉంటున్నాడు. ఆర్మూర్‌లో తన పని ముగించుకొని కేశ్‌పల్లి వెళ్తుండగా యానం గుట్ట ఎక్స్ రోడ్డు వద్ద ట్రాక్టర్ ఢీకొంది. గంగాధర్ అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతుడి భార్య సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు.

లారీ ఢీకొని ఒకరు..



గోపాల్(ఫైల్)

నిజామాబాద్ రూరల్/బాన్సువాడ రూరల్: రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్లారం అటవీ ప్రాంతంలో ధాన్యం బస్తాల లారీ ఎదురుగా వస్తున్న వ్యాన్‌ను ఢీకొనడంతో గోపాల్(55) అనే వ్యక్తి మృతిచెందినట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో మహ్మద్‌ఆరీఫ్ తెలిపారు. వివరాలు. బాన్సువాడ మండలం బోర్లం గ్రామానికి చెందిన అన్నం గోపాల్ శ్రీవాణి బీడీ కంపెనీ నిర్వహిస్తున్నాడు. ఆయన శుక్రవారం బీడీలను తీసుకొని వ్యాన్‌లో నిజామాబాద్ వైపు వస్తుండగా మల్లారం గండి వద్ద ధాన్యం లోడ్‌తో వెళ్తున్న లారీ ఢీకొంది. ప్రమాదంలో వ్యాన్‌లో ఉన్న గోపి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

రోడ్డు కిందకు దూసుకెళ్లిన బస్సు



నిజామాబాద్ రూరల్: ఆర్టీసీ బస్సు అదుపు తప్పి రోడ్డు కిందకు దూసుకుపోయిన ఘటన రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బైపాస్ రోడ్డులో చోటు చేసుకుంది. రూరల్ ఎస్‌హెచ్‌వో మహ్మద్ ఆరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ డిపో–1కు చెందిన బస్సు శుక్రవారం ఉదయం 10 గంటలకు కోరట్‌పల్లి గ్రామానికి బయలు దేరింది. కంఠేశ్వర్ బైపాస్ రోడ్డులో బస్సు అదుపు తప్పి పొదల్లోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో బస్సులో 30 మంది ప్రయాణికులు ఉండగా ఎవరికీ గాయాలు కాలేదు.

ఆవును చంపిన దుండగులు



లింగంపేట: లింగంపేట మండలం పొల్కంపేట గ్రామంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆవును గొడ్డలితో నరికి చంపారు. గ్రామానికి చెందిన చాకలి కాంతమయ్య తన ఆవును గ్రామ శివారులోని పశువుల కొట్టం వద్ద కట్టేశాడు. శుక్రవారం ఉదయం వెళ్లి చూడగా ఆవు రక్తం మడుగులో చనిపోయి ఉంది. గోవును హతమార్చిన విషయాన్ని పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ రవీందర్‌నాయక్, సీసీఎస్ సీఐ శ్రీనివాస్, స్థానిక ఎఎస్సై ప్రకాష్‌నాయక్ ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. కాంతమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టినట్లు డీఎస్పీ తెలిపారు. ఆవును చంపిన వారిని పట్టుకుంటామన్నారు.

కుక్కల దాడిలో పలువురికి గాయాలు



ఎడపల్లి: ఎడపల్లి మండలంలోని ఏఆర్‌పీ క్యాంప్ గ్రామంలో వీధి కుక్కల దాడిలో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఓ మహిళను కుక్కలు పెదవి కరవడంతో తీవ్రంగా రక్తస్రావం అయింది. గ్రామస్తులు ఆమెను వెంటనే ఆస్పత్రికి తరలించారు.

అసిస్టెంట్ లైన్‌మన్‌పై దాడి



బోధన్‌రూరల్: బోధన్ మండలంలోని ఊట్‌పల్లి గ్రామంలో ట్రాన్స్‌కో అసిస్టెంట్ లైన్‌మన్ (ఏఎల్‌ఎం) నవీన్ కుమార్‌పై ఇద్దరు మహిళలు దాడికి పాల్పడటంతో కేసు నమోదు చేసినట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి తెలిపారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అసిస్టెంట్ లైన్‌మన్ నవీన్ కుమార్ శుక్రవారం ఊట్‌పల్లిలో మీటర్ల పరిశీలనకు వెళ్లాడు. ఈ క్రమంలో గ్రామంలో ఓ ఇంటికి అక్రమంగా విద్యుత్‌ను వినియోగిస్తుండటంతో గమనించి కనెక్షన్ తొలగిస్తుండగా ఆ ఇంటి ఓనర్ సాయమ్మ, ఆమె కోడలు సునీత కర్రతో దాడికు పాల్పడ్డాడు. దీంతో అతని ముఖానికి గాయమైంది. నవీన్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కరెంట్ షాక్‌తో గేదె మృతి



భిక్కనూరు: మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో కరెంట్ షాక్‌తో శుక్రవారం పాడి గేదె మృతి చెందింది. గ్రామానికి చెందిన ముదాం మంజుల గేదె విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేస్తూ సపోర్టు వైరుకు తగిలింది. సపోర్టు వైరుకు విద్యుత్ సరఫరా కావడంతో షాక్ కొట్టి చనిపోయింది. మండల పశువైద్యాధికారి దేవేందర్ ఘటన స్థలాన్ని సందర్శించి పంచనామ నిర్వహించారు. గేదె విలువ రూ.90 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపారు. ప్రమాద స్థలాన్ని ట్రాన్స్‌కో ఏఎల్‌ఎం రాథోడ్, మాజీ ఎంపీటీసీ కోడూరి సాయాగౌడ్‌లు సందర్శించారు.